# నీవు పరులను ప్రేమిస్తే పరమాత్మ నిన్ను ప్రేమిస్తాడు

కర్మమున పుట్టు జంతువు
కర్మముననె వృద్ధి పొంది కర్మమున చనున్
కర్మయె నరునకు దైవము
కర్మయె సుఖదుఃఖములకు కారణమిలలో!

భగవంతుని ఎక్కడో వెతుకనక్కరలేదు. భగవద్గీతయందు 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః', 'అందరూ నా అంశములే' అన్నాడు కృష్ణపరమాత్మ. మీలో ప్రతి ఒక్కరియందు భగవంతుడే వున్నాడు. మీ వెంటనే, జంటనే వున్న భగవంతుని వెతికేదెక్కడ! మీరు ఏ పని చేసినప్పటికీ అది భగవంతుని కార్యమే. భగవంతుడు మానవునికి దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము అనే నాలుగు అంశములను ఏర్పరిచాడు. యువకులకు ఈ వయస్సులో దేహము చాలా పుష్టిగా వుంటుంది, మనస్సు చాలా శక్తివంతముగా వుంటుంది. బుద్ధియొక్క విచారణాశక్తి చాలా పటుత్వంతో కూడి వుంటుంది. కానీ, వీటిని దుర్వినియోగం చేస్తున్నారు. మనస్సులో దైవాన్ని చింతిస్తూ సర్వాంగములను సద్వినియోగ పరచుకోవలసిందిపోయి తమ ఇంద్రియాలను పెడమార్గం పట్టిస్తున్నారు. ఇది చాలా పొరపాటు. ఈ వయస్సులో మనము దేహశక్తిని, మనోశక్తిని, బుద్ధిశక్తిని సద్వినియోగపరచుకోవాలి. అనగా, పవిత్ర మార్గములో ప్రవేశపెట్టాలి. కన్నులున్నవి కదాయని అన్నిటినీ మనము చూడకూడదు. ఏది మంచిదో దానినే చూడటానికి ప్రయత్నించాలి. చెడ్డచూపులను చూసి చెడును సంపాదించుకో కూడదు. సూరదాసుకు కన్నులు లేవు. కాని, నిరంతరము, 'కృష్ణా! కృష్ణా! కృష్ణా!' అని కృష్ణ నామమునే స్మరిస్తూ వచ్చాడు. కనుకనే, కృష్ణ పరమాత్మ సూరదాసుకు దర్శనమిచ్చి సంతృప్తి పరచాడు. చెవులతో అనవసరమైన విషయాలను, పరదూషణ వినకూడదు. చెడ్డచూపులు చూడటం, పరదూషణ వినటం మహాపాపం. భగద్విషయాలను మాత్రమే శ్రవణం చేయటం చాలా మంచిది. భగవంతుడు నాలుకను దేనికోసం ఇచ్చాడు? రుచి చూచేకోసమా లేక పరులను నిందించే కోసమా? కాదు, కాదు. నోటితో భగవన్నామాన్ని ఉచ్చరించాలి, ఇతరులకు వినిపించాలి, వారిని తరింప చేయాలి. మనం కీర్తన దేనికోసం చేస్తున్నాము? రాగం కోసమా? కాదు, కాదు. మన రోగ నివారణ కోసం చేస్తున్నాము. ఒక్క పర్యాయము 'రామా' అంటే ఎంతో ఆనందము కలుగుతుంది. అయితే, మనసారా చేయాలి. 'రామా! నన్ను బ్రోవరా!' అని పద్యరూపంలో